మిషన్ భగీరథపై సమగ్ర సర్వే

● నల్లా కనెక్షన్ల వివరాల సేకరణ
● ప్రత్యేక యాప్‌లో నమోదు

పెద్దవంగర: మిషన్ భగీరథ పథకం అమలు తీరు క్షేత్రస్థాయిలో ఎలా ఉంది, గత ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం ద్వారా లక్ష్యానికి అనుగుణంగా ప్రతి ఇంటికి నీరు సరాఫరా అవుతుందా.. లోపాలు ఏమైన ఉన్నాయా.. ప్రస్తుతం ఉన్న పరిస్థితులపై గ్రాయ పంచాయతీ కార్యదర్శులు ఈనెల 11వ తేదీ నుంచి వివరాలు సేకరించి ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు చేస్తున్నారు.

మండలంలోని 20 గ్రామ పంచాయితీలు ఉన్నాయి. 6,855 కుటుంబాలు ఉండగా 27,823 మంది జనాభా ఉన్నారు. నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంకులు 50 ఉండగా పాతవి 14 ఉన్నాయి. ఒక ట్యాంకు నీటి సామర్థ్యం 2,075 లీటర్లు. కాగా 2015లో గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకాన్ని అమలు చేసి ట్యాంకులను, పైపులైన్లు వేయించి ఇంటింటికి నీటి కనెక్షన్ ఇప్పించింది. దీంతో ఆయా గ్రామాల్లోని జీపీ బోరు మోటార్లు, ట్యాంకుల వినియోగం తగ్గించారు.

జిల్లా కేంద్రంలో శిక్షణ


వడ్డెకొత్తపల్లి గ్రామంలో సర్వే పరిశీలిస్తున్న ఎంపీడీఓ

క్షేత్రస్థాయిలో మిషన్ భగీరథ పథకం అమలు తీరును పరిశీలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర సర్వే నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా సర్వే నిర్వహణపై జీపీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు జిల్లా కేంద్రంలో ఒక రోజు సర్వేపై శిక్షణ అందించారు. సర్వే ఎలా నిర్వహించాలి. వివరాల నమోదు, ఏఏ అంశాలు తీసుకోవాలి, ఫొటోలు అప్‌లోడ్ చేసే విధానంపై అవగాహన కల్పించారు. మండలంలో జీపీల వారీగా పంచాయతీ కార్యదర్శులతోపాటు శిక్షణ పొందిన ఈజీఎస్ గ్రామాధికారులు ఇంటింటికి వెళ్లి మిషన్ భగీరథ పథకం క్షేత్రస్థాయిలో ఏ మేరకు అమలు అవుతుంది. ఇంటింటికి మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ ఉందా.. పైపు లైన్లు ఎలా ఉన్నాయి. ట్యాంకు నీరు ఏమేరకు నల్లాల ద్వారా ఇళ్లకి చేరుతుంది. వాటిని ప్రజలు ఏ మేరకు వినియోగిస్తున్నారు. ఒక్కో ఇంటికి ఎన్ని లీటర్ల నీటిని అందిస్తున్నారు. ఎక్కడైన లీకేజీలు ఉన్నాయా.. అనే వివరాలతోపాటు ఆధార్, ఫోన్ నంబర్‌తోపాటు ఆ ఇంటి కుటుంబ సభ్యుడి ఫొటో తీసి యాప్‌లో పొందుపరుస్తూ సర్వే చేస్తున్నారు. ఇప్పటి వరకు 4,792 కుటుంబాలనే సర్వే చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

సమగ్ర సర్వే నిర్వహిస్తున్నాం..



మిషన్ భగీరథ పథకంపై సమగ్ర సర్వే నిర్వహిస్తున్నాం. వివరాలను ప్రత్యేక యాప్‌లో పొందుపరిచి ఆన్‌లైన్ చేస్తున్నాం. దీంతో సమగ్ర నివేదిక సిద్ధం కానుంది. ఈజీఎస్, జీపీ కార్యదర్శులు వివరాలు సేకరిస్తున్నారు. ఇప్పటికి 71 శాతం సర్వే పూర్తి అయ్యింది.

– వేణుమాధవ్, ఎంపీడీఓ, పెద్దవంగర

నేడు విద్యుత్ సమస్యలపై ప్రజావాణి

కొత్తగూడ: ప్రభుత్వ ఆదేశానుసారం విద్యుత్ వినియోగ దారుల సమస్యలపై సోమవారం గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సురేష్ తెలిపారు. రైతులు, గృహ, పారిశ్రామిక వినియోగ దారులు తమ సమస్యలను రాత పూర్వకంగా అందిస్తే పరిష్కరిస్తారన్నారు. మండల వాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చిన్నగూడూరు/తొర్రూరు: తెలంగాణ ఎన్పీడీసీఎల్ సీఎండీ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం విద్యుత్ సమస్యలపై ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక విద్యుత్ డీఈ జి.మధుసూదన్, ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని చిన్నగూడూరు విద్యుత్ సెక్షన్ కార్యాలయంలో నేడు విద్యుత్ సమస్యలపై ప్రజావాణి కార్యక్రమం ఉంటుందని ఏఈ నవ్య ఆదివారం తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి

పెద్దవంగర: విద్యుత్ సమస్యలపై ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు విద్యుత్ డీఈ మధుసూదన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఉంటుందన్నారు.

ప్రతీ సోమవారం ప్రజావాణి

గార్ల: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ప్రతీ సోమవారం విద్యుత్ ప్రజావాణి నిర్వహించనున్నట్లు విద్యుత్ ఏఈ మహేంద్రబాబు ఆదివారం తెలిపారు. వినియోగదారుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు విద్యుత్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఇకనుండి గార్ల సబ్‌స్టేషన్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కురవి: మండల కేంద్రంలోని ఏడీఏ కార్యాలయంలో నేడు(సోమవారం) విద్యుత్ ప్రజావాణి నిర్వహించడం జరుగుతుందని ఏడీఈ ఎ.రమేష్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గూడూరు: మండల కేంద్రంలోని అయోధ్యపురం, గూడూరు విద్యుత్ కార్యాలయాలలో నేడు విద్యుత్ ప్రజావాణి నిర్వహించనున్నట్లు ఏఈ ప్రణీత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

విశ్రాంత ప్రాంగణం ఏర్పాటు అభినందనీయం

నెల్లికుదురు: తొర్రూరు లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో మండలంలోని కాచికల్ గ్రామంలో ఏర్పాటు చేసిన విశ్రాంత ప్రాంగణాన్ని ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ లయన్స్ క్లబ్ బాధ్యులు, స్థానిక నాయకులతో కలసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ తొర్రూరుకు చెందిన కందూరి గీతరాజేందర్‌రెడ్డి 50వ వివాహ మహోత్సవ కార్యక్రమం పురస్కరించుకొని కాచికల్ గ్రామంలో ప్రజలు, ప్రయాణికుల సౌకర్యార్థం విశ్రాంత ప్రాంగణాన్ని ఏర్పాటు చేయం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో లయన్ అధ్యక్షుడు గంజి విజయపాల్‌రెడ్డి, కార్యదర్శి రమేష్, కోశాధికారి శ్రీనివాస్, కాంగ్రెస్ మండల నాయకుడు ఇట్టే దేవేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గుగులోతు శ్రీనివాస్, నాయకులు ప్రభాకర్, సత్యపాల్ రెడ్డి, లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


విశ్రాంత ప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థికసాయం చేస్తున్న బాలాజీనాయక్

గూడూరు: మండలంలోని చక్రుతండాకు చెందిన అజ్మీర మల్లానాయక్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెల్సుకున్న గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బానోతు మంగ బాలాజీ నాయక్ ఆదివారం కుటుంబాన్ని పరామర్శించారు. ఈసందర్భంగా రూ.10వేలతోపాటు 50కిలోల బియ్యం అందించారు. ఇదేవిధంగా గూడూరు శివారు వడ్డెరగూడెంకు చెందిన రిటైర్డ్ టీచర్ శివరాత్రి సాయిలు ఇటీవల మృతిచెందాడు. విషయం తెల్సుకున్న గూడూరుకు చెందిన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి వాంకుడోతు కొమ్మాలునాయక్ వారి కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చిట్టి వెంకన్న, నాయకులు బీరం శ్రీపాల్‌రెడ్డి, రాసమల్ల యాకయ్య, చంటి స్వామి పాల్గొన్నారు.

బాలిక మృతిపై విచారణ చేపట్టాలి

నెహ్రూసెంటర్: గిరిజన బాలిక వసంత మృతిపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని గిరిజన సామాజిక చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ కిషన్‌నాయక్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరిపెడ మండలానికి చెందిన గిరిజన కుటుంబం బతుకుదెరువుకు మియాపూర్ వెళ్లి జీవిస్తున్నారని, ఆ కుటుంబానికి చెందిన బాలిక అదృశ్యమై వారం రోజుల తరువాత శవంగా మారడం ప్రభుత్వం, పోలీసుల నిర్లక్ష్యమేనన్నారు. రాష్ట్ర రాజధానిలో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. బాలిక మృతిపై సమగ్ర విచారణ జరిపి కుటుంబానికి న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుడ్డెల రాంమూర్తి, నిసార్, పోలెపాక వెంకన్న, గుంజె హన్మంతు, మహంకాళి వీరన్న, కొత్త శ్రీనివాస్, ప్రభాకర్, దాసరి అంబరీష, తపూరణ, భూక్య బిచ్యానాయక్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కిషన్‌నాయక్

పట్టపగలే వెలుగుతున్న వీధిలైట్లు



గార్ల: మండలంలోని కోట్యానాయక్‌తండా గ్రామంలో 15రోజుల నుంచి పట్టపగలు వీధిలైట్లు వెలుగుతున్నా, సంబంధిత పంచాయతీ సిబ్బంది ఏమాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మీ సేవలో సదరం క్యాంపుల సమాచారం

పాలకుర్తి: దివ్యాంగులు సదరం క్యాంపులు మీ సేవలో స్లాట్ బుకింగ్ సమాచారాన్ని తెలుసుకోవాలని కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 17వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు సదరం స్లాట్ క్యాంపు బుకింగ్‌లు జిల్లా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. డాక్టర్ రిపోర్టు, ఆధార్ కార్డు, ఫొటో, మీ సేవ రశీదుతో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలని సత్యనారాయణ కోరారు.

వైభవంగా కల్యాణ మహోత్సవం


కల్యాణ వేడుకలను నిర్వహిస్తున్న వేదపండితులు

కురవి: రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న సీరోలు మండల కేంద్రంలోని శివాలయం, వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శివపార్వతులు, వేంకటేశ్వరస్వామి అలివేలుమంగమ్మ, పద్మావతిల కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. వేద పండితులు శరత్‌శర్మ, హరిత్‌శర్మ, శ్రీనివాస్ శర్మ, గిరిధిరచారి, కృపాల్‌శర్మ, అభిరామ్ శర్మల ఆధ్వర్యంలో కల్యాణ వేడుకలను నిర్వహించారు. స్వామి వారికి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ వి.హర్షవర్ధన్ రెడ్డి-దీపికలు అందజేశారు. కల్యాణ వేడుకలను తిలకించేందుకు వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ, స్వాతంత్ర్య సమరయోధుడు వి.వెంకటరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బండి వెంకటరెడ్డి, తహసీల్దార్ శారద, జూనియర్ అసిస్టెంట్ మాధవరావు, ఆలయ అర్చకుడు సంతోష్, మాజీ సర్పంచ్‌లు శ్యామలరంగమ్మ, నాగేశ్వర్‌రావు, రామచంద్రునాయక్, గురువయ్య పాల్గొన్నారు.

'గుడుంబా విక్రయిస్తే పథకాలు నిలిపివేత'

నెల్లికుదురు: గుడుంబా రహిత గ్రామంగా మండలంలోని రాజులకొత్తపల్లి గ్రామాన్ని పోలీసు అధికారులు గ్రామ యువకుల సహకారంతో 25రోజుల పాటు శ్రమించి తీర్చి దిద్దినట్లు గ్రామ యువ నాయకుడు వరిపెల్లి అనిల్ కుమార్ తెలిపాడు. ఈసందర్భంగా గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన గుడుంబా నివారణపై అవగాహన కార్యక్రమంలో పోలీసు అధికారులు కిరణ్, శ్రీనివాస్‌తో కలసి మాట్లాడారు. గుడుంబా తాగితే జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. గుడుంబా రహిత గ్రామంగా తయారైన గ్రామాన్ని మళ్లీ ఎవరైన గుడుంబా తయారు చేసినా, విక్రయించినా వారికి ప్రభుత్వం నుంచి అందే సంక్షేమ పథకాలను కలెక్టర్ ఆదేశాలతో నిలిపివేస్తామన్నారు. గుడుంబా నియంత్రణకు గ్రామస్తులంతా సహకరించాలని కోరారు.


మాట్లాడుతున్న అనిల్ కుమార్

ప్రాణాలు పోయాక పట్టించుకుంటారా..!

● మృత్యుఘోషాలుగా విద్యుత్ తీగలు
● తక్కువ ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్లు
● మూగజీవాలకు శాపంగా మారిన వైనం
● మారని విద్యుత్ శాఖ అధికారుల తీరు..

మరిపెడ రూరల్: ప్రతి రోజు ఏదో ఒక చోట విద్యుదాఘాతంతో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. ప్రాణం పోతేనే విద్యుత్ శాఖ స్పందించి మరమ్మతులు చేపడుతోంది. ఈక్రమంలోనే కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలతో, తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు మూగజీవాలు తగిలి ప్రాణాలను కోల్పోతున్నాయి. ఒకటి కాదు.. రెండు కాదు పదుల సంఖ్యలో ఇటీవల మండలలో మూగజీవాలు విద్యుదాఘాతంతో మృత్యువాత పడ్డాయి. మండలంలో గతంలో ఎప్పుడో బిగించిన తీగలు ప్రస్తుతం కిందకు వేడులుతున్నాయి. మండలంలోని లూనావత్ తండ గ్రామ పంచాయతీ శివారు ఆకేరు వాగు ఒడ్డున వ్యవసాయ క్షేత్రాల్లో లెవన్ కేవీ విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయి. ఓ స్తంభం విరిగి తీగలు కిందకు ఉన్నాయి. అక్కడే కిందకు వేలాడుతున్న తీగలకు గుంజ కర్రను ఏర్పాటు చేసి సపోర్ట్‌గా పెట్టారు. ఎస్ఎస్ 9 ట్రాన్స్‌ఫార్మర్ 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ తీగలు కిందకు ఉండడంతో రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా మండలంలోని ఎడ్జెర్ల, గాలివారిగూడెం, రేఖ్యతండలోని వ్యవసాయ క్షేత్రాల్లో ఏర్పాటు చేసిన పలు ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఎత్తులో నిర్మించారు. మేత కోసం ఊరు శివారులోకి వెళ్లిన పశువులు ఇంటికి వచ్చే వరకు గ్యారెంటీ లేదు. ఇప్పటికైన విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయడంతో పాటు కిందకు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను ఎత్తులో ఏర్పాటు చేయాలని మండల ప్రజలు, రైతులు కోరుతున్నారు.


లూనావత్‌తండా సమీపంలో వేలాడుతున్న విద్యుత్ తీగలకు ఏర్పాటు చేసిన కర్రలు


వేడులాడుతున్న తీగలను చూపుతున్న రైతులు


స్తంభాన్ని పూర్తిగా చుట్టేసిన పిచ్చి మొక్క తీగలు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


తొర్రూరు: ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం


కేసముద్రం: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

తొర్రూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1985–86లో ఎస్సెస్సీ పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. డివిజన్ కేంద్రంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఆదివారం నిర్వహించిన పూర్వవిద్యార్థుల సమ్మేళనంలో ఆడి పాడి సందడి చేశారు. అనంతరం నాటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పెరుమాండ్ల రవిగౌడ్, మారిపెల్లి వెంకన్న, దయాకర్‌రెడ్డి, జిలుకర సోమశేఖర్, కృష్ణారావు, రామ్మోహన్‌రెడ్డి, పులి నవీన్, సోమనర్సయ్యచారి పాల్గొన్నారు.

కేసముద్రం: పూర్వ విద్యార్థులు ఒకరికి ఒకరు సహకరించుకుంటూ ఐకమత్యంతో ఉండాలని కేసముద్రం స్టేషన్ జెడ్పీహైస్కూల్ రిటైర్డ్ హెచ్ఎం స్వరాజ్ బాబు అన్నారు. కేసముద్రంస్టేషన్ జెడ్పీ హైస్కూల్ 2003–04 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని స్థానిక వీసీబీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. అనంతరం విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎం స్వరాజ్‌బాబు, స్వరాజ్‌బాబు, దుర్గాప్రసాద్, ఉప్పల వీరయ్య, శ్రీనివాసచారి, మారానుజాచారి, వెంకటయ్య, రాజువీరు, రమేష్‌రెడ్డి, నజీరుద్దీన్, నమ్మాల్‌వార్, తదితరులు పాల్గొన్నారు.


బయ్యారం: వెంకట్రాంపురంలో..

బయ్యారం: మండలంలోని వెంకట్రాంపురం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 20ఏళ్ల తరువాత చదువుకున్న పాఠశాలలో ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. 2002–03 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఒకరినొకరు కలుసుకున్నారు. యోగక్షేమాలు తెలుసుకుంటేనే చిన్ననాటి తీపిగుర్తులను నెమరవేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో గురువులు ప్రభాకర్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, రాంబాబు, కృష్ణమూర్తి, సాధ్విమణి, అనురాధ, పూర్వవిద్యార్థులు ఉపేందర్, సతీష్, రాజు, భీముడు, వెంకన్న, రాందాస్, భాస్కర్ పాల్గొన్నారు.


దంతాలపల్లి: 2005-06 బ్యాచ్ విద్యార్థులు

దంతాలపల్లి: మండలకేంద్రంలోగల జిల్లా ప్రజాపరిషత్ సెకండరీ పాఠశాలలో 2005–06 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. అనంతరం పాఠాలు నేర్పిన నాటి గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సోమయ్య, వేణుమాధవరెడ్డి, నర్సింహారెడ్డి, వెంకటేశ్వర్లు, రహిమాన్, రామచంద్రమూర్తి, కరుణసాగర్, సోమ భిక్షం, పూర్వ విద్యార్థులు అశోక్, సాగర్, రామకృష్ణ, తిరుమలేష్, శ్రీశైలం, రవి, నాగమణి, శ్రావణి, శోభ, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి రూ.81వేల ఆర్థికసాయం

కేసముద్రం: మండల కేంద్రంలో పెద్దోజు నరేష్‌కి చెందిన మెడికల్ షాప్ ఇటీవల అగ్నిప్రమాదానికి గురై దగ్ధమైన విషయం తెలిసిందే. ఈమేరకు నష్టపోయిన మెడికల్‌షాప్ యజమాని నరేష్ పరిస్థితిని చూసి స్పందించిన మండలానికి చెందిన పలు మెడికల్ షాపుల యజమానులు కలసి రూ.49వేలు, జిల్లా కేంద్రానికి చెందిన మెడికల్ షాపుల యజమానులు రూ.32వేలు, మొత్తంగా రూ.81వేలను బాధితుడికి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ షాప్ యజమానులు శ్రీనిఆవస్, ఎండిఆసిమ్‌అలీ, వేణు, సతీష్, అనిల్, ఏకాంతం, రాజు, తదితరులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం చేస్తున్న షాపుల యజమానులు

తెగిపడిన విద్యుత్ తీగలు



గార్ల: మండలంలో గత రాత్రి వీచిన గాలిదుమారానికి రాజ్యాతండా గ్రామ సమీపంలో విద్యుత్ తీగలు తెగిపడి కింద పడిపోవడంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. పశువులను మేతకు వదలాలంటే విద్యుదాఘాతానికి గురవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత విద్యుత్ అధికారులు స్పందించి కిందపడిపోయిన విద్యుత్ లైన్ తీగలకు వెంటనే మరమ్మతులు చేపట్టి సరిచేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

క్లుప్తంగా

కాలనీలో మంచినీటి సరఫరాకు చర్యలు



నెహ్రూసెంటర్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు కొండపల్లి గోపాల్ నగర్ కాలనీ ప్రజలకు మిషన్‌భగీరథ ద్వారా నీటి సరఫరాకు చర్యలు చేపడుతున్నామని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథి రెడ్డి తెలిపారు. కాలనీలోని కొన్ని ప్రాంతాలకు నీరు రాకపోవడంతో ప్రజల విజ్ఞప్తి మేరకు మున్సిపల్ సిబ్బందితో పైప్‌లైన్ సరి చేసే కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డు పరిధిలోని ప్రజలకు ఇంటింటికీ నీరు అందించేందుకు, ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుని అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న పాల్గొన్నారు.

పశు వైద్యశాల ఏర్పాటు చేయాలి

గార్ల: మండలంలోని చిన్నకిష్టాపురం పంచాయతీలో పశువైద్యశాల ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత రైతులు జి.సత్రు, వి.సత్రు ఆదివారం డిమాండ్ చేశారు. పశువులకు ఏమైనా అత్యవసర జబ్బులు వస్తే, 6కిలోమీటర్ల దూరంలో ఉన్న ముల్కనూరు పశువైద్యశాలకు తీసుకెళ్లాల్సి వస్తుందన్నారు. వాటికి ఏమైన అత్యవసర వైద్యం ఏర్పడినప్పుడు ప్రైవేటు వ్యక్తులతో వైద్యం చేయించుకుంటూ రైతులు ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నకిష్టాపురంలో వైద్యశాల ఏర్పాటు చేస్తే పంచాయతీలోని దేశ్యతండా, మంగలితండా, ఎస్టీకాలనీ, సర్వన్‌తండా గ్రామాల రైతులకు అందుబాటులో ఉంటుందని రైతులు పేర్కొన్నారు. సంబంధిత జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి స్పందించి పశు వైద్యశాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసే లక్ష్య సాధనకు ప్రభుత్వం సహాయ, సహకారం అవసరం ఉందని ప్రముఖ పారిశ్రామిక, వ్యాపార, రాజకీయ వేత్త, కిసాన్ పరివార్ అధినేత నునావత్ భూపాల్ నాయక్ అన్నారు. మంత్రి ధనసరి సీతక్క, రాష్ట్ర పంచాయతీ రాజ్ కమిషనర్ అనితరామచంద్రన్‌ను హైదరాబాదులోని సచివాలయంలో ఆదివారం ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్రునాయక్ ద్వారా భూపాల్‌నాయక్ కలిశారు.

26న ఏఐకేఎంఎస్ జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశం

నెహ్రూసెంటర్: ఏఐకేఎంఎస్ మహబూబాబాద్ జిల్లా జనరల్ కౌన్సిల్ సమావేశం ఈ నెల 26వ తేదీన ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గుజ్జు దేవేందర్ ఆదివారం తెలిపాడు. జిల్లా కేంద్రంలోని దేశెట్టి రాంచంద్రయ్యహాల్‌లో జరగనున్న కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మామిడాల భిక్షపతి, గౌని ఐలయ్య, ముఖ్య నేతలు హాజరవుతున్నారని తెలిపారు.

సేవా కార్యక్రమాలను ప్రోత్సహించాలి



తొర్రూరు: సేవా కార్యక్రమాలు చేసే వారిని ప్రోత్సహించాలని లయన్స్‌క్లబ్ జిల్లా క్యాబినెట్ కార్యదర్శి డాక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. క్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ రాజేందర్‌రెడ్డి, గీతారెడ్డి దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం డివిజన్ కేంద్రంలో టీచర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ డాక్టర్ శారద, జోన్ చైర్మన్ నాగవాణి, టీచర్స్ క్లబ్ అధ్యక్షుడు వినోద్‌రెడ్డి, చార్టర్ అధ్యక్షుడు నూరం ఉపేందర్‌రెడ్డి, ప్రతినిధులు రేగూరి వెంకన్న, పెరుమాండ్ల రమేష్ పాల్గొన్నారు.

గంగమ్మకు పూజలు

బయ్యారం: వర్షాలు సమృద్ధిగా కురిసి తమ పశుపక్షాదులను సల్లంగా చూడాలని కోరుతూ ఆదివారం మండలంలోని గంధంపల్లి–కొత్తపేటలో యాదవులు గంగదేవతకు ఘనంగా పూజలు నిర్వహించారు. వర్షాలు కురవాలని దేవతను కోరుతూ పూజలు నిర్వహించటం ఆనవాయితీగా వస్తుంది.